## క్లుప్తంగా

### ఆదిగణపతి శిబిరంలో లడ్డూ వేలం



అంగరలో వేలంలో పాడుకున్న లడ్డూతో పాటదారు సురేంద్ర

కపిలేశ్వరపురం: అంగరలోని చప్పిడిపాలెం ఆది గణపతి చవితి శిబిరంలో ఆదివారం లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తుడు స్వామికి సమర్పించిన 11 కేజీల లడ్డూకు శనివారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి సురేంద్ర రూ.2,700 కి పాడుకున్నారు. భక్తులకు, బంధువులకు లడ్డూను ప్రసాదంగా అందజేశారు. కార్యక్రమంలో దాసరి చిన్నరాజా, ముత్తా సురేష్, సంగుల కనకం, శనివారపు గోవింద్, పడాల వీరబాబు పాల్గొన్నారు.

### కేశవరంలో మొరాయించిన రైల్వే గేటు



గేటు మొరాయించడంతో కింద నుంచి వస్తున్న ద్విచక్ర వాహనచోదకులు

మండపేట: మండలంలోని కేశవరం వద్ద ఆదివారం రైల్వే గేటు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం గేట్ లాకు పడిపోయి తెరుచుకోకపోవడంతో దాదాపు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కేశవరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే వారు కడియం మీదుగాను, కేశవరం నుంచి మండపేట వైపు వచ్చే వారు జెడ్. మేడపాడు మీదుగాను రాకపోకలు సాగించారు. ద్విచక్ర వాహనచోదకులు కింద నుంచి తమ వాహనాలను తీసుకు వచ్చారు. కొద్దిసేపటికి లాక్ ఓపెన్ అయినట్టు ప్రయాణికులు తెలిపారు. తరచూ ఈ గేటు వద్ద సాంకేతిక సమస్య తలెత్తి ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు తెలిపారు. కాగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతల చొరవతో ఈ గేటు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం నిమిత్తం స్థలసేకరణ కోసం రెండు రోజులుగా సర్వే పనులు జరుగుతున్నాయి. త్వరలోనే కేశవరంలో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు మొదలు కానున్నాయని గ్రామానికి చెందిన నాయకులు తెలిపారు.

### రోగులకు పండ్ల పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ తదితరులు

మండపేట: వైఎస్సార్ సీపీ నేత, మండపేట శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పార్టీ నేతలతో కలిసి శ్రీనివాస్ రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తొలుత స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపం వద్ద నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, సొసైటీ మాజీ చైర్మన్ కుక్కల రామారావు తదితరులు శ్రీనివాస్‌ను సత్కరించారు. కౌన్సిలర్లు బొక్కా సరస్వతి, నీలం దుర్గ, వైఎస్సార్‌సీపీ నాయకులు యాండ్ర ప్రభాకరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లి శివ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో ద్రాక్షారామ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 15న విశాఖపట్నం జిల్లా గాజువాకలో నిర్వహించిన 15వ స్టేట్ ఓపెన్ కెన్యూ ర్యూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థులు ప్రతిభ కనబరచి వివిధ పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ బీకే రత్నం తెలిపారు. సీనియర్ విభాగంలో ఎ.డాలీ, శ్రీదుర్గ, మణిప్రభ, ఎ.ప్రియదర్శన్, కార్తిక్, కె.విష్ణు, పి.తేజ ప్రథమ స్థానంలోను, జూనియర్ విభాగంలో వి.మహేష్ కార్తిక్, పి.కిషోర్, పి.కృష్ణ, వై.సాత్విక్, జి.కిరణ్, ఎ.సంతోష్, బి.రిషిదుర్గప్రసాద్ ద్వితీయ స్థానంలోను, పి.లక్ష్మణ్‌సాయి, కె.చరణ్, ఎ.పరిశుద్ధ, జి.వినయ్‌దుర్గ తృతీయ స్థానంలోనూ నిలిచారన్నారు. చిన్నారులను, వారికి శిక్షణ ఇచ్చిన పెంద్ర బాలకృష్ణను పలువురు అభినందించారు.

# ప్రాదేశిక పాలనకు రెండేళ్లు

- జగనన్న పాలనలో గ్రామాల్లో సంక్షేమం
- ప్రతి నెలా ప్రజలకు ఆర్థిక సాయం
- గర్వంగా భావిస్తున్న ప్రజాప్రతినిధులు
- గ్రామాల్లో మెరుగ్గా అభివృద్ధి, సంక్షేమం



ప్రజాప్రతినిధులుగా గెలిచిన అనంతరం మండపేటలో ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధులు (ఫైల్)

కపిలేశ్వరపురం: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి అనగానే ప్రజలతో మమేకమయ్యే పదవి. ప్రజలు తమ అవసరాలను, సమస్యలను చెప్పుకునే అవకాశం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారానే సాధ్యపడుతుంది. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా జరిగి మండల, జిల్లా పరిషత్‌లు ఏర్పడ్డాయి. రెండేళ్ల పాలనా అనుభం తమను ప్రజలకు మరింత దగ్గర చేసిందని ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల పాలనా తీరుపై ఈ కథనం...

**పరిషత్ ఎన్నికల నేపథ్యమిదీ...**

పరిషత్ ఎన్నికలకు 2020లో ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ కోవిడ్ ప్రభావంతో నోటిఫికేషన్‌ను 2020 మార్చి 15న రద్దు చేశారు. తిరిగి 2021 ఏప్రిల్ 8న ఎన్నికలు నిర్వహించారు. రెండు నియోజకవర్గాల పరిధిలో మండపేట మండలం అర్తమూరు 01, రామచంద్రపురం రూరల్ మండలం వెల్ల 01, 02, కె.గంగవరం మండలంలో మూడు మొత్తం ఆరు ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికలు ప్రక్రియ పూర్తయినప్పటికీ ప్రతిపక్షాలు కోర్టును ఆశ్రయించడంతో కౌంటింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. 2021 సెప్టెంబర్ 19న లెక్కింపు చేపట్టగా 24న సభ్యులుగా ప్రమాణాలు చేయడంతో పరిషత్ పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి.

**రెండు నియోజకవర్గాల్లో ప్రాదేశిక ప్రజాప్రతినిధులిలా...**

| నియోజకవర్గం | గ్రామాలు | ఎంపీపీ/జెడ్పీటీసీ స్థానాలు | ఎంపీటీసీ స్థానాలు |
|---|---|---|---|
| మండపేట | 43 | 03 | 60 |
| రామచంద్రపురం | 75 | 03 | 58 |
| మొత్తం | 118 | 06 | 118 |

**మహిళా ప్రాతినిధ్యం పెరగడం ప్రత్యేకత**

రెండు నియోజవకర్గాల్లో అమలు చేసిన రిజర్వేషన్లు మహిళా ప్రాతినిధ్యానికి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుల్లో మండపేట రూరల్ బీసీ మహిళ, రాయవరం, కె.గంగవరం జనరల్ మహిళ, కపిలేశ్వరపురం, రామచంద్రపురం రూరల్ జనరల్, కాజులూరు బీసీ జనరల్ సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులు జెడ్పీటీసీలుగా ఉన్నారు. ఎంపీపీ స్థానాల్లో రామచంద్రపురం రూరల్, కాజులూరు స్థానాలకు ఎస్సీ మహిళ, కపిలేశ్వరపురం, కె.గంగవరం ఎంపీపీ స్థానాలకు బీసీ మహిళ, రాయవరం ఎంపీపీ స్థానానికి బీసీ జనరల్, మండపేట రూరల్ ఎంపీపీ స్థానానికి జనరల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి మండపేట రూరల్ మండలంలో 22, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల్లో 20 చొప్పున, రాయవరం, కపిలేశ్వరపురంలలో 19 చొప్పున కె.గంగవరంలో 18 మొత్తం 118 ఎంపీటీసీ స్థానాల్లో వివిధ సామాజికవర్గ ప్రజాప్రతినిధులు సేవలందిస్తున్నారు.

**రెండేళ్లలో ప్రజలతో మమేకం**

ప్రస్తుత పరిషత్ పాలకవర్గాలు తమ రెండేళ్ల పాలనంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారాన్ని చేపట్టిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడం ప్రారంభించడంతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలందరూ గర్వంగా భావిస్తున్నారు. నెల నెలా పింఛను సక్రమంగానూ, పారదర్శకంగానూ అందిస్తుండడమూ, ప్రతి గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, పాలసేకరణ కేంద్రాల భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆసుపత్రులు, పాఠశాల భవనాలు మెరుగు పడడంతోపాటు వాటి నిర్వహణ మెరుగైంది. అన్ని వర్గాల ప్రజలకు ప్రజాప్రతినిధులు సమక్షంలోసంక్షేమం అందుతుంది.

**ప్రతి నెలా సంక్షేమం అందుతోంది**



గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ లబ్ధి అడపా తడపా అన్నట్టు అందేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారు జాము ఆరు గంటలకు పింఛను డబ్బులను తలుపు తట్టి అందిస్తున్నారు. దీంతో ప్రజల్లో ప్రజాప్రతినిధిగా సంతోషంగా ఉంది. ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తుండటం గర్వంగా భావిస్తున్నాను.

– మేర్నీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, రామచంద్రపురం

**ఎమ్మెల్సీ సహకారంతో అభివృద్ధి**



ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో మండపేట రూరల్ గ్రామాల్లో అభివృద్ధి వేగంగా సాగుతోంది. ఎమ్మెల్సీగా ఆయన ప్రజల్లోనే ఉండడమూ, ప్రజలు అడిగిన వెంటనే స్పందించి నిధులను మంజూరు చేసి అభివృద్ధి చేయడమూ వెంట వెంటనే జరుగుతుంది. అదే తరహాలో మండపేట రూరల్ గ్రామాల్లో అభివృద్ధి పనులు మెరుగ్గా సాగుతున్నాయి.

– కుడుపూడి భవాని, జెడ్పీటీసీ, మండపేట రూరల్ మండలం

**పాలనా అనుభవాన్ని గడించాను**



నేను వరుసగా రెండోసారి ఎంపీటీసీగా గెలిచి ప్రస్తుతం కపిలేశ్వరపురం ఎంపీపీగా సేవలందిస్తున్నాను. ప్రజలు నాకు ఈ అవకాశం ఇవ్వడంతో మంచి పాలనా అనుభవాన్ని గడించాను. నా తోటి మహిళా ప్రజాప్రతినిధులతో కలసి క్షేత్ర స్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్నారు. మండలంలో రూ.1.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాం.

– మేడిశెట్టి సత్యవేణి, ఎంపీపీ, కపిలేశ్వరపురం

**ప్రజా ప్రతినిధిగా గర్వంగా ఉంది**



సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంపీటీసీగా గర్వంగా భావిస్తున్నాను. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల సమస్యలు క్షణాల్లో పరిష్కారమవుతున్నాయి. సంక్షేమమూ, అభివృద్ధి రెండు కళ్ళుగా మెరుగ్గా సాగుతున్నాయి. మండల కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పడంతో గ్రామాల ప్రజలు సంతోషంగా ఉన్నారు.

– దేవు ప్రసాదునాయుడు, జెడ్.మేడపాడు ఎంపీటీసీ, మండపేట రూరల్ మండలం

# ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

రసాయనాల పిచికారీలో జాగ్రత్తలు అవసరం



కాజులూరులో వరి పంటపై రసాయన మందులు పిచికారీ చేస్తున్న రైతులు

కాజులూరు: పంటలపై పురుగులు, తెగుళ్ల బెడద రోజురోజుకూ అధికమౌతుంది. వాటి నివారణకు రైతులు పంట పొలాల్లో పలు రకాల రసాయన మందులు వినియోగిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 63 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది తొలకరిలో రైతులు సుమారు 54 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రస్తుతం పంట దుబ్బుకట్టే దశ నుంచి చిరుపొట్ట దశకు చేరువలో ఉంది. ఈ దశలో పంటకు నష్టం కలిగితే భవిష్యత్తులో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో రైతులు పంటపై ఏ చిన్నపాటి తెగుళ్లు, పురుగులు కనిపించినా నివారణకు వెంటనే ఏదో ఒక మందును పిచికారీ చేస్తున్నారు. అయితే పంటల రక్షించుకోవాలన్న ఆతృతతో ఎరువులు, పురుగుమందుల పిచికారీ చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించకపోవటంతో విష ప్రభావానికిలోనై అనారోగ్యాల పాలవుతున్నారు. మందుల పిచికారీ సమయంలో రైతులు సరైన జాగ్రత్తలు పాటిస్తే అధిక వ్యయాలకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ చూచిస్తున్నారు.

- మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకోవాలి. కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి. కొన్ని రకాల మందులు కళ్లలో పడితే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది
- మందులు పిచికారీ సమయంలో మద్యం తాగడం, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి పీల్చడం చేయకూడదు
- మధ్యాహ్నం సమయంలో ఎండవేడి ఎక్కువగా ఉన్నప్పుడు మందులు పిచికారీ చేయకూడదు
- మందులు పిచికారీ చేసే సమయంలో వదులుగా ఉండే దుస్తులు ధరించాలి
గాలి వాటానికి ఎదురెళుతూ పొలంలో మందులు చల్లకూడదు
- పురుగు మందులు పిచికారీ చేసిన తరువాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి
- మందు వినియోగించిన తర్వాత డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యి తీసి పాతి పెట్టాలి, లేదా నిప్పు పెట్టి కాల్చివేయాలి
- మందులు పిచికారీ చేస్తున్నప్పుడు, లేదా చేసిన తర్వాత ఎవరైనా విషప్రభావానికి లోనై వాంతు చేసుకుంటున్నా, కళ్లు తిరుగుతున్నట్టయితే, చర్మం దురదలు పెడుతున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించి ప్రథమ చికిత్స చేయించుకోవాలి.

## ఆధ్యాత్మిక చింతనతో సమస్యలు దూరం



తనుమళ్లలో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: ఆధ్యాత్మిక చింతనతో మనిషి మానసిక ప్రశాంతతను పొంది సమస్యలకు దూరంగా ఉండగలుగుతాడని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తనుమళ్లలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి ఆదివారం మంత్రి వేణు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భగవంతునిపై భక్తిభావాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, పార్టీ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మాజీ ఎంపీటీసీ సలాది రమణ, పార్టీ నాయకులు దుబాయ్ శ్రీను, పిల్లి శ్రీను, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్టోబర్ 3 నుంచి 'సురక్ష' ఆరోగ్య శిబిరాలు



వీధివారిలంకలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని ఐదు గ్రామాల్లో అక్టోబర్ 3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారి పి.రత్నకుమారి తెలిపారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్ళి బీపీ, షుగరు, హిమోగ్లోబిన్, మలేరియా తదితర ఏడు రకాల పరీక్షలను చేస్తున్నారన్నారు. వాటిని పరిశీలించి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 3న కపిలేశ్వరపురం సీహెచ్‌సీ వద్ద, 4న అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల, 5న తాతపూడి సచివాలయం, 6న కపిలేశ్వరపురం 02 సచివాలయం, 16న పడమర ఖండ్రిక గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ శిబిరంలో వైద్యసేవలందిస్తామని రత్నకుమారి తెలిపారు.

**లంక గ్రామాల్లో అవగాహన**

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక, వీధివారిలంక గ్రామాల్లో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వానపల్లి పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఎస్ రాధాకృష్ణ, హెచ్‌వీ సత్యవతి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు లంక గ్రామాల్లో ఏడు రకాల వైద్య పరీక్షలను చేస్తున్నామన్నారు. వైద్య రిపోర్టుల్లో ఆరోగ్య సమస్యలు నిర్ధారణ అయితే మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య కార్యకర్త మానేపల్లి పళ్ళాలమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీగణపతి హోమం



రాయవరంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

రాయవరం: స్థానిక ఈశ్వరరెడ్డి నగర్, జమీందార్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం లక్ష్మీగణపతి హోమం వైభవంగా నిర్వహించారు. 108 మంది దంపతులు పీటలపై కూర్చుని హోమాన్ని నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో హోమ క్రతువును నిర్వహించిన అనంతరం ఘనంగా అన్న సమారాధన చేపట్టారు. రాయవరం పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొన్నారు.

## ఏడిదలో రోడ్డు పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ ఆశీర్వాదం తదితరులు

మండపేట: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఏడిద గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తున్నామని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల ఏడిద సావరం రోడ్డును 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 10 లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసే పనులకు వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జిలతో కలసి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆశీర్వాదం మాట్లాడుతూ ఏడిదలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎనలేని సహకారం అందిస్తున్నారన్నారు. దేవుడు కాలనీలో రూ.63 లక్షలతో సీసీ రోడ్లు, ఏడిద నుంచి సావరం వరకూ రూ.53 లక్షలతో సీసీ రోడ్డు, రూ. 16 లక్షలతో డంపింగ్ యార్డుకు ప్రహరీ, రూ. 27 లక్షలతో గ్రామంలో పలు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణంతో పాటు రూ. 19 లక్షలతో ఏడిద కొత్తూరులో ఇంటింటికి కుళాయి సదుపాయం కల్పించామన్నారు. రూ. 15 లక్షలతో క్రైస్తవ శ్మశాన వాటికను అభివృద్ధి చేశామని సర్పంచ్ ఆశీర్వాదం వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు పటాన్ల నాగబాబు, ఈఓ వుండమట్ల వీర్రాజు, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, వల్లూరి రామకృష్ణ, బేతా వెంకటేశ్వరరావు, బి. వీరబాబు, రామకృష్ణ, కె. బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతీ పూజ



చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న చైతన్యబాబు

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండు వద్ద ఆదివారం రాత్రి ఘనంగా సరస్వతి పూజ జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి రాజేష్, నరేష్ (చిన్నారి) సోదరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి 150 మందికి పైగా చిన్నారులు హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆ పార్టీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త వేగుళ్ల చైతన్యబాబు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. బస్టాండు వద్ద తొలిసారిగా గణపతి నవరాత్ర ఉత్సవాలను ప్రారంభించి వైభవంగా నిర్వహిస్తున్న రాజేష్, చిన్నారి సోదరులను ఆయన అభినందించారు. అర్చకులు నారాయణశాస్త్రి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఏడిద సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు కొప్పిరెడ్డి పద్మావతి, సాధనాల శివ భగవాన్, అయినవిల్లి ఆదినారాయణ, కోయల సాయిబాబా, కాయల రాము, కాయల చంద్రశేఖర్, కాయల రమేష్, కోయల సతీష్, రావూరి దుర్గాప్రసాద్, పిల్లా విజయ్, అంజి పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి భారీ విరాళాలు అందుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రావులపాలెం మండలం దేవరపల్లికి చెందిన జి.నాగజ్యోతి రూ.25 వేలు, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.వెంకట సత్య నరసింహ విజయలక్ష్మి రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన యు.బులి వెంకట నాగ భీమశంకర్ రూ.10,116, పేరుపాలేనికి చెందిన కె.రవి రూ.10 వేలు విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

## అబ్బురపరిచిన మాదిగ మాస్టీల విన్యాసాలు



కపిలేశ్వరపురంలో కాళ్లు, భుజాలకు బరువులు అమర్చుకుని నడుస్తున్న మాదిగ మాస్టీలు

కపిలేశ్వరపురం: స్థానిక బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం ప్రదర్శించిన మాదిగ మాస్టీల విన్యాసాలు అబ్బురపరిచాయి. జగపతి ఆధ్వర్యంలోని రాంబాబు, సుబ్బారావు, అబ్బులు, విజయ్‌కుమార్ తదితర 25 మంది కళాకారులు సంచార జీవనం గడుపుతూ ప్రజాక్షేత్రంలో కళా ప్రదర్శనలు ఇస్తున్నారు. కొమ్ములు తిరిగిన గొర్రెపోతుతో ఢీకొట్టే ప్రదర్శనలో కళాకారులు ధైర్య సాహసాలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి. కాళ్ళకు, భుజాలకు బరువులు అమర్చుకుని నడవడం గగుర్పాటుకు గురి చేశాయి. ట్రాక్టరులను లాగిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మాదిగ మాస్టీల కళాకారులను దళిత నాయకుడు ఎం.శివకుమార్ తదితరులు ప్రశంసించారు.

# వాడపాలెంలో నేడు నాటక ప్రదర్శన

కొత్తపేట: మండలంలోని వాడపాలెం పాత మార్కెట్ వీధి శ్రీఆది గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో సోమవారం రాత్రి దేవనర్తకి, సత్యహరిశ్చంద్ర (కాటిసీను) పౌరాణిక నాటకాలు ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యుడు గనిశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. ఏటా వాడపాలెంలో గనిశెట్టి చంద్రశేఖర్, బండారు భాస్కరరావు, సింగిరెడ్డి గోవిందుస్వామి, కురచ ప్రకాశరావు తదితర కమిటీ సభ్యులు, కళాపోషకులు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో నాటక, సాంస్కృతిక ప్రదర్శనలు పునరుద్ధరించిన విషయం తెలిసిందే. విధిగా ప్రస్తుత రంగస్థల రారాజు, అభినవ హరిశ్చంద్రుడిగా ఖ్యాతిఘడించిన జూనియర్ డీవీ సుబ్బారావును ప్రత్యేకంగా తీసుకువచ్చి సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఏడాది విభిన్నంగా తొలుత దేవనర్తకి, అనంతరం సత్యహరిశ్చంద్ర (కాటిసీను) నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. జూనియర్ డీవీ సుబ్బారావు దేవనర్తకిలో భవానిశంకరుడు, హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు పాత్రలు పోషిస్తుండగా, కడప రత్నశ్రీ దేవనర్తకి, చంద్రమతిగా, జబర్దస్త్ అప్పారావు సుబ్బారావుగా, ఇతర పాత్రల్లో ప్రముఖ రంగస్థల నటులు నటిస్తున్నారు. కళాభిమానులు, కళా పోషకులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి రెండు నాటక ప్రదర్శనలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

## విఘ్నేశ్వరుని సన్నిధిలో డీటీ



డీటీ భానుప్రకాష్‌ను అభినందిస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని డిప్యూటీ కలెక్టర్ మిమ్మిడి భానుప్రకాష్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు డిప్యూటీ కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటం ప్రసాదం అందజేశారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ కాకర శ్రీను, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు తదితరులు ఉన్నారు.